క్లుప్తంగా

ఐఎన్‌టీయూసీ జిల్లా అధ్యక్షుడు మొదిలి కన్నుమూత



మొదిలి శ్రీనివాసరావు (ఫైల్)

విజయనగరం అర్బన్‌: ఐఎన్‌టీయూసీ జిల్లా అధ్యక్షుడు, శ్రమ శక్తి రాష్ట్ర అవార్డు గ్రహీత మొదిలి శ్రీనివాసరావు (65) కన్ను మూశారు. విశాఖలోని ఆయన స్వగృహంలో నిద్రలోనే గురువారం ఉదయం మృతి చెందినట్లు కుమారుడు కౌశిక్‌ గుర్తించారు. వెంటనే శ్రీనివాసరావు భౌతికకాయాన్ని విజయనగరంలోని స్వగృహానికి తరలించారు. పెద్ద ఎత్తున కార్మికులు, అభిమానులు, కాంగ్రెస్‌ కార్యకర్తలు శ్రీనివాసరావు భౌతిక కాయాన్ని సందర్శించి ఘనంగా నివాళులర్పించారు. భార్య కమలావతి, ఇద్దరు కుమార్తెలు ఇందిరసంయుక్త, నాగదుర్గ నివేదిక, కుమారుడు కౌశిక్‌లను కలిగిన శ్రీనివాసరావు దివంగత కార్మిక నాయకుడు మొదిలి సత్యం కుమారుడు. మొదిలి సూర్యారావు సోదరుడు. తండ్రి, అన్నయ్య అడుగుజాడల్లో నడిచి కార్మిక వర్గానికి శ్రీనివాసరావు అత్యంత ఆప్తుడయ్యారు. 1983 ఎన్నికల్లో విజయనగరం అసెంబ్లీ నియోజకవర్గం నుంచి కాంగ్రెస్‌ పార్టీ తరఫున పూసపాటి అశోక్‌ గజపతిరాజుపై పోటీ చేసిన చరిత్ర మొదిలి శ్రీనివాసరావుది. పలుముఖా కార్మిక సంఘాలకు అధ్యక్షుడిగా, జిల్లా తెలగ సంక్షేమ సంఘం నిర్మాణంలోనూ విస్తృతంగా పాల్గొని తన సహాయ సహకారాలు అందించారు. గతంలో ఆంధ్రభూమి దినపత్రికలో పనిచేసిన ఆయన ఐఎన్‌టీయూ జాతీయ అధ్యక్షుడు సంజీవరెడ్డికి ప్రధాన అనుచరుడిగా గుర్తింపు పొందారు. కార్మికలోకం ఒక మంచి నాయకుడిని కోల్పోయిందని పలువురు సంతాపం వెలిబుచ్చారు. ఆయన మృతికి కార్మిక నాయకులు, పత్రికాప్రతినిధులు పలువురు తీవ్ర సంతాపం తెలియజేశారు.

విచారణ

విజయనగరం క్రైమ్‌: స్థానిక మూడులాంతర్లు జంక్షన్‌ వద్ద బుధవారం రాత్రి పలువురు వ్యక్తులు హల్‌చల్‌ చేశారు. అటుగా వెళ్లిన ప్రయాణికులపైనా తమ జులుం చూపించడంతో విషయం తెలుసుకున్న టూటౌన్‌ పోలీసులు రంగంలోకి దిగారు. కేసు నమోదు చేసి విచారణ చేపడుతున్నామని సీఐ శ్రీనివాస్‌ గురువారం తెలిపారు.

ఆయన నేత్రాలు సజీవం



కార్నియా సేకరిస్తున్న వైద్య సిబ్బంది

చీపురుపల్లి: ఆ ఊరిలో సామాజిక స్ఫూర్తిని రగిలించిన వ్యక్తి ఆయన. ఉపాధ్యాయుడిగా సేవలందించి, ఉద్యోగ విరమణ తర్వాత సర్పంచ్‌గా ఊరికి సేవ చేసి, ప్రజాపిత బ్రహ్మ కుమారీస్‌ ద్వారా ఆధ్యాత్మిక సేవలందించి, మరణించాక నేత్రదానం చేసి మరింత స్ఫూర్తిని రగిలించారు. ఆయనే మండలంలోని పెదనడిపల్లి మాజీ సర్పంచ్‌, విశ్రాంత ఉపాధ్యాయుడు మన్నె పెదసత్యనారాయణ. ఈయన బుధవారం మరణించారు. అయితే ఆయన ముందుగానే నేత్రదానానికి అంగీకార పత్రం అందజేయడంతో కుటుంబ సభ్యులు ఆయన నేత్రాలను దానం చేసేందుకు అంగీకరించారు. ఈ విషయాన్ని పట్టణానికి చెందిన మానవీయత స్వచ్ఛంద సంస్థ అధ్యక్షుడు బి.వి.గోవిందరాజులు శ్రీకాకుళం రెడ్‌క్రాస్‌ సంస్థకు సమాచారం ఇవ్వడంతో ఆ సంస్థ చైర్మన్‌ జగన్‌మోహన్‌రావు సూచనల మేరకు మగటపల్లి కల్యాణ్‌ నేత్ర సేకరణ కేంద్రం వైద్య సిబ్బంది పి.సుజాత, ఉమాశంకర్‌ తదితరులు మృతుడి నుంచి కార్నియా సేకరించారు. కార్నియాను విశాఖపట్టణంలోని ఎల్‌.వి.ప్రసాద్‌ నేత్ర సేకరణ కేంద్రానికి తరలిస్తున్నట్లు గోవిందరాజులు తెలిపారు.

రహదారి భద్రతా మాసోత్సవాలు ప్రారంభం



సీఐ నారాయణమూర్తిని సన్మానిస్తున్న డిపో మేనేజర్‌,తదితరులు

శృంగవరపుకోట: రహదారి భద్రతా మాసోత్సవాలను స్థానిక ఆర్టీసీ డిపోలో సీఐ వి.నారాయణమూర్తి గురువారం ప్రారంభించారు. ఈసందర్భంగా డిపోమేనేజర్‌ రమేష్‌ మాట్లాడుతూ ఫిబ్రవరి 15 వరకు నిర్వహించనున్న మాసోత్సవాల్లో డ్రైవర్ల శిక్షణ, ప్రమాదరహిత డ్రైవర్లకు అలవెన్స్‌లు, డ్రైవర్ల దినోత్సవం, వైద్యపరీక్షలు, డ్రైవర్ల ఫ్యామిలీ కౌన్సిలింగ్‌, రహదారి భద్రతా అవగాహన, రక్తదాన శిబిరం, డ్రైవర్లకు అవార్డు ప్రదానం తదితర కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు చెప్పారు. నెలరోజుల పాటు సిబ్బంది భద్రతపై అవగాహన కల్పిస్తామన్నారు. ప్రమాదాల నివారణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలను సీఐ వివరించారు.

అన్నదాత అంటే అంత చులకనా..!

- రైతులపై కూటమి ప్రభుత్వం చిన్నచూపు
- అన్ని విధాలా మేలు చేస్తానని హామీ
- అధికారంలోకి వచ్చిన తర్వాత రైతులను పట్టించుకోని నాయకులు
- 2024లో అందని అన్నదాత సుఖీభవ
- 2.63 లక్షల మంది ఎదురుచూపులు
- వైఎస్సార్‌సీపీ హయాంలో ఐదేళ్లూ అందిన రైతుభరోసా నగదు

వైఎస్సార్‌సీపీ హయాంలో అందించిన రైతుభరోసా వివరాలు

సంవత్సరం	రైతుల సంఖ్య	అందిన మొత్తం
2019–20	2,03,451	రూ.274.66 కోట్లు
2020–21	2,39,363	రూ.323.14
2021–22	2,46,433	రూ.332.69
2022–23	2,51,659	రూ.343.69
2023–24	2,63,394	రూ.355.58 కోట్లు



వరి నూర్పు చేస్తున్న రైతులు (ఫైల్)

విజయనగరం ఫోర్ట్‌: రైతులను అన్నివిధాలా ఆదుకుంటాం.. ప్రతి రైతుకూ అన్నదాత సుఖీభవ పథకం కింద రూ. 20 వేలు రైతులకు అందిస్తాం అంటూ కూటమి నేతలు ఎన్నికల సమయంలో ఊరూరా తెగ ప్రచారం చేశారు. దీంతో వారి మాటలు నమ్మిన ప్రజలు వారికి అధికారం కట్టబెట్టారు. తీరా గద్దెనెక్కిన తర్వాత రైతన్నను కూటమి సర్కార్‌ పట్టించుకోవడం మానేసిందనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఖరీఫ్‌ సీజన్‌ ముగిసింది. రబీ సీజన్‌ కూడా మరికొద్ది రోజుల్లో ముగియనుంది. అయినప్పటికీ అన్నదాత సుఖీభవ పథకం కింద కూటమి ప్రభుత్వం వేస్తామన్నా ఒక్క పైసా కూడ వేయలేదు. అసలు దాని గురించి కూటమి సర్కార్‌ స్పష్టత ఇవ్వడం లేదు.

రైతులకు తప్పని అవస్థలు..

ఖరీఫ్‌, రబీ సీజన్‌ల్లో పంట పెట్టుబడికి వైఎస్సార్‌ సీపీ ప్రభుత్వంలో ఏటా రూ. 13,500 చొప్పున ఆర్థిక సాయం అందేది. దీంతో రైతులు సాగుకు అవసరమైన విత్తనాలు, ఎరువులు కొనుగోలు చేసుకునేవారు. కాని కూటమి ప్రభుత్వం వచ్చాక పెట్టుబడి సాయం విడుదల చేయక పోవడం వల్ల రైతులు అప్పులు చేసి మరీ సాగు చేపట్టాల్సి వచ్చింది. అధిక వడ్డీలకు అప్పులు చేయడం వల్ల వచ్చిన రాబడి అంతా అప్పులకే చెల్లించాల్సిన దుస్థితి నెలకొంది.

పంటల బీమాకు మంగళం..

వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో ఉచిత పంటల బీమా పథకాన్ని వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం ఐదేళ్ల పాటు అమలు జరిగింది. ఈ క్రాప్‌ నమోదు చేసుకున్న ప్రతి రైతుకూ ప్రభుత్వమే పంటల బీమా ప్రీమియం చెల్లించింది. దీంతో ప్రకృతి వైపరిత్యాలు సంభవించినప్పుడు ప్రభుత్వం నుంచి పంట నష్టపరిహారం అందేది. కూటమి సర్కార్‌ వచ్చిన తర్వాత ఉచిత పంటల బీమా పథకానికి మంగళం పాడేసింది. పంటల బీమా ప్రీమియంను రైతులే చెల్లించుకోవాలనే చెప్పేసింది. దీంతో రబీ సీజన్‌లో సాగు చేస్తున్న వరి, మొక్కజొన్న, అపరాలు, మామిడి పంటలకు రైతులే బీమా ప్రీమియం చెల్లించుకున్నారు.

గతంలో ఠంచన్‌గా రైతుభరోసా..

వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో రైతులకు ఠంచనుగా వైఎస్సార్‌ రైతుభరోసా పథకం కింద పెట్టుబడి సాయం అందేది. ప్రతి ఏటా రూ.13,500 చొప్పున మంజూరు చేసేవారు. మే నెలలో రూ.7500, అక్టోబర్‌లో రూ.4 వేలు, జనవరిలో రూ. 2 వేలు చొప్పున మూడు విడతల్లో సాయం అందించేవారు.

అప్పుచేసి పెట్టుబడి పెట్టాను..



నాకు రెండు ఎకరాలు పొలం ఉంది. అందులో వరి పంట వేశాను. పంటకు పెట్టుబడి లేక రూ. 20 వేలు అప్పు చేసి పెట్టుబడి పెట్టాను. జగన్‌ మోహన్‌రెడ్డి ఉన్నప్పుడు రైతుభరోసా కింద డబ్బులు ఇవ్వడం వల్ల పెట్టుబడికి అప్పలు చేయలేదు. కాని ఇప్పుడు రైతు భరోసా ఇవ్వకపోవడం వల్ల అప్పలు చేయాల్సి వస్తోంది.

ఎస్‌. రామునాయుడు, రైతు

పెట్టుబడి సాయం రాలేదు..



జగన్‌ మోహన్‌రెడ్డి ప్రభుత్వం ఉన్నప్పుడు ప్రతి ఏడాదీ రైతుభరోసా డబ్బులు పడేవి. కాని ఇప్పుడు డబ్బులు పడలేదు. నాకు రెండున్నర ఎకరాల పొలం ఉంది. వరి పంట సాగు చేస్తున్నాను. పంట పెట్టుబడికి అప్పు చేసి పెట్టాను.

ఎస్‌. సన్యాసియ్య, రైతు

తప్పని ఎదురుచూపులు

కూటమి సర్కార్‌ రైతుభరోసా (అన్నదాత సుఖీభవ) సాయం అందిస్తుందని జిల్లాలో 2.63 లక్షల మంది రైతులు ఎదురుచూపులు చూస్తున్నారు. 2024 – 25లో అన్నదాత సుఖీభవ సాయం అందించలేదు. 2025 – 26లో కూడా ఈ పథకంపై ఎటువంటి స్పష్టత ఇవ్వలేదు.

క్రీడలతోనే ఉజ్వల భవిష్యత్‌



క్రీడాకారులతో రాముునాయుడు, తదితరులు

పూసపాటిరేగ: క్రీడలతోనే ఉజ్వల భవిష్యత్‌ ఉంటుందని కొవ్వాడ సర్పంచ్‌ కోట్ల రాముునాయుడు అన్నారు. మండలంలోని కొవ్వాడలో యువతకు వాలీబాల్‌, క్రికెట్‌ కిట్లను గురువారం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. క్రీడలలో రాణించిన ఎంతోమంది రిజర్వేషన్లతో దేశంలో అత్యున్నతమైన ప్రభుత్వ ఉద్యోగాలలో స్థిరపడ్డారన్నారు. క్రీడలు శారీరక, మానసిక వికాసాన్ని స్తాయని చెప్పారు. కార్యక్రమంలో కల్యాణపు హరిబాబు, పలువురు యువకులు పాల్గొన్నారు.

సజావుగా కానిస్టేబుల్‌ ఉద్యోగ నియామక ప్రక్రియ

విజయనగరం క్రైమ్‌: స్టైపెండరీ పోలీస్‌ కానిస్టేబుల్‌ ఉద్యోగ నియామకాలకు ప్రాథమిక రాత పరీక్షల్లో అర్హత సాధించిన అభ్యర్థులకు పీఎంటి, పీఈటీ పరీక్షల ప్రక్రియ కొనసాగుతున్నట్లు ఎస్పీ వకుల్‌ జిందల్‌ గురువారం తెలిపారు. 11వ రోజు గురువారం నిర్వహించిన పరీక్షలకు 600 మంది పురుష అభ్యర్థులకు గాను 415 మంది మాత్రమే హాజరయ్యారన్నారు. వారిలో 314 మంది అభ్యర్థులు తుది రాత పరీక్షకు అర్హత సాధించారని పేర్కొన్నారు. నియామక ప్రక్రియ సజావుగా జరిగే విధంగా అదనపు ఎస్పీ పి.సౌమ్యలత, ఏఆర్‌ అదనపు ఎస్పీ జి.నాగేశ్వరరావు, డీఎస్పీలు ఎం.వీరకుమార్‌, యూనివర్స్‌, ఎస్‌.రాఘవులు, తదితరులు పర్యవేక్షించారు.



అభ్యర్థులకు ఛాతి కొలుస్తున్న అధికారులు



హైజంప్‌ చేస్తున్న అభ్యర్థి



పరుగు పందెంలో పాల్గొన్న అభ్యర్థులు

నిధులన్నీ ఖర్చు చేయాలి..

- లోక్‌సత్తా పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు భీశెట్టి బాబ్జీ

విజయనగరం ఫూల్‌బాగ్‌: గ్రామాల్లో మౌలిక సదుపాయాలు కల్పించాలనే లక్ష్యంతో ప్రభుత్వం విజయనగరం జిల్లాకు కేటాయించిన రూ.331.32 కోట్ల (మెటీరియల్‌ నిధులు) ఉపాధిహామీ నిధులు 2025 మార్చి నెలలోగా శతశాతం ఖర్చు అయ్యేటట్లు చూడాలని లోక్‌సత్తా పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు భీశెట్టి బాబ్జీ కోరారు. ఈమేరకు డ్వామా పీడీ శారదాదేవిని గురువారం ఆమె కార్యాలయంలో కలిసి వినతి పత్రం అందజేశారు. అనంతరం ఆయన విలేకరులతో మాట్లాడుతూ.. కూటమి ప్రభుత్వం ఏర్పడ్డాక రాష్ట్రంలో 11 జిల్లాలకు రూ.1995.78 కోట్లు మంజూరు చేసిందని.. అయితే ఇప్పటివరకు రూ.567.14 కోట్లకు సరిపడా ప్రణాళికలు సిద్ధం చేశారన్నారు. తిరుపతి, విజయనగరం, ఎన్టీఆర్‌ జిల్లాలకు రహదారుల పనులకు కేటాయించిన రూ.661.47 కోట్లలో రూ.144.32 కోట్లే ఖర్చు చేశారని తెలిపారు. విజయనగరం జిల్లాకు కేటాయించిన రూ.331.32 కోట్లలో 75.23 శాతం ఖర్చుకు సంబంధించి ప్రణాళికలు సిద్ధం చేశారని.. మిగిలిన 22.71 శాతానికి తగిన ప్రణాళికలు మార్చి 2025 లోగా సిద్ధం చేయకపోతే నిధులు వెనక్కి మళ్లిపోయే ప్రమాదముందన్నారు. ఇలా జరిగితే అభివృద్ధి కుంటుపడుతుందని ఆందోళన వ్యక్తం చేశారు. జిల్లా వ్యాప్తంగా పలు ప్రభుత్వ పాఠశాలలకు ప్రహరీలు లేవని, నిధులు అందుబాటులో ఉన్నందును వెంటనే పనులు ప్రారంభించాలని కోరారు. శ్రీకాకుళం, నెల్లూరు జిల్లాలు ప్రభుత్వం ఇచ్చిన నిధులతో గ్రామీణ ప్రాంతాల్లో రోడ్లు, కాలువలు ఏర్పాటు చేసుకున్నాయన్నారు. కార్యక్రమంలో పార్టీ జిల్లా ప్రతినిధి థాత్రాజు రాజారావు, పౌరవేదిక కార్యదర్శి తుమ్మగంటి రామ్మోహనరావు, తదితరులు పాల్గొన్నారు.



డ్వామా పీడీ శారదాదేవికి వినతిపత్రం అందజేస్తున్న బాబ్జీ

14 మందిపై కేసు నమోదు..

విజయనగరం క్రైమ్‌: నగరంలోని కేఎల్‌పురం యాతపేటలో ఇరువర్గాల మధ్య బుధవారం జరిగిన ఘర్షణకు సంబంధించి ఇరువర్గాలకు చెందిన 14 మందిపై గురువారం కేసు నమోదు చేసినట్లు సీఐ ఎస్‌. శ్రీనివాస్‌ తెలిపారు. ప్రజలను ఇబ్బంది పెట్టిన నేపథ్యంలో తహసీల్దార్‌ సమక్షంలో బైండోవర్‌ చేయనున్నట్లు చెప్పారు.

భూగర్భ జలాలు ఉప్పమయం..



చంపావతి ఉప్పుటేరులో చేరుతున్న సముద్రపునీరు

- తాగునీటికి తప్పని ఇక్కట్లు

పూసపాటిరేగ: మండలంలోని కోనాడ గ్రామ సమీపంలో ఉన్న చంపావతి నదీ పరివాహక ప్రాంతంలో గల ఉప్పుటేరులోకి సముద్రం నీరు కలుస్తుండడంతో తాగునీటి బోర్లు, వ్యవసాయ బోర్ల నీరు ఉప్పుగా మారుతోంది. దీంతో మూడు గ్రామాల ప్రజలు తాగునీటికి ఇబ్బంది పడుతున్నారు. మండలంలోని బొడ్డుగురయ్యపేట, బొడ్డు వెంకటేశుపేట, కోనాడ గ్రామాలలో భూగర్భ జలాలు ఉప్పుగా మారాయి. చంపావతి నది కలిసే చోట గ్రోయిన్‌ కట్టినట్లయితే సముద్రపు నీరు రాకుండా గెడ్డలో కలవకుండా ఉంటుందని.. దీంతో కొంతవరకు భూగర్భజలాలు బాగుంటాయని ఆయా గ్రామాల ప్రజలు చెబుతున్నారు. కోనాడ పరిసర ప్రాంతాలలో ఉన్న సుమారు 100 వరకు బోర్ల నుంచి ఉప్పునీరు వస్తోందని ప్రజలు చెబుతున్నారు. వ్యవసాయబావులు ఉన్నా ఉప్పునీరు వస్తుండడంతో తప్పనిసరి పరిస్థితుల్లో వర్షాధారంపై ఆధారపడాల్సి వస్తోందని అన్నదాతలు వాపోతున్నారు. ప్రభుత్వం, అధికారులు స్పందించి చంపావతి నదిలో గ్రోయిన్‌ ఏర్పాటు చేస్తే మేలు జరుగుతుందని ప్రజలు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా పాలకులు, అధికారులు స్పందించి సమస్యను పరిష్కరించాలని ప్రజలు కోరుతున్నారు. ఈ విషయమై ఎంపీడీఓ ఎం. రాధిక మాట్లాడుతూ.. సమస్యను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకువెళ్లి పరిష్కారానికి కృషి చేస్తామన్నారు.


రైతు బజారు... సమస్యలతో బేజారు

- కనీస వసతులు కరువు
- టార్పాలిన్‌ల కింద కూరగాయలు విక్రయిస్తున్న రైతులు
- తాగునీరు కూడా అందుబాటులో లేని వైనం
- మంత్రి కొండపల్లి ఇలాకాలో రైతుబజారు దుస్థితి



టార్పాలిన్‌ కింద కూరగాయలు విక్రయిస్తున్న రైతులు

గంట్యాడ: రైతు బజార్లను తామే కనిపెట్టాం, వాటిని అన్నివిధాలా అభివృద్ధి చేస్తాం అంటూ టీడీపీ నేతలు గొప్పలు చెబుతుంటారు. కానీ వాస్తవ పరిస్థితి అందుకు విరుద్ధంగా ఉంది. అభివృద్ధి మాట దేవుడెరుగు కనీ స సౌకర్యాలు కరువయ్యాయి. మండలంలోని కొఠారుబిల్లి జంక్షన్‌ వద్ద ఉన్న రైతు బజార్‌ దుస్థితే ఇందు కు నిదర్శనం. మంత్రి కొండపల్లి శ్రీనివాస్‌ సొంత మండలంలో ఈరైతు బజార్‌ ఉన్నప్పటికీ అభివృద్ధికి నోచుకోకపోవడం పట్ల సర్వత్రా విమర్శలు వినిపిస్తున్నాయి.



మూలకు చేరిన వాటర్‌ ప్లాంట్‌

టార్పాలిన్లే దిక్కు

రైతుబజార్‌లో షెడ్లు లేక పోవడం వల్ల రైతులు టార్పాలిన్ల నీడన కూరగాయలు విక్రయించుకోవాల్సి వస్తోంది. ఎండవేడిమి తట్టుకోలేక అల్లాడుతున్నారు. వర్షాలు కురిసే సమయంలో ఇబ్బంది పడుతున్నా రు. రైతు బజార్‌లో 14 దుకాణాలు ఉంటే 10 దుకాణాలకే మాత్రమే షెడ్లు ఉన్నాయి. నాలుగు దుకాణాలకు షెడ్లు లేవు. రైతు బజారుకు వచ్చే వినియోగదారులకు కానీ , కూరగాయలు విక్రయించుకునే రైతులకు కానీ కనీసం తాగడానికి నీళ్లు కూడా అందుబాటులో ఉండడం లేదు. మూలకు చేరిన వాటర్‌ప్లాంట్‌ను బాగు చేయించే నాథుడే కనిపించడం లేదు. మరుగుదొడ్డి కూడా ఒకటే ఉంది. దాన్ని మహిళలు మాత్రమే వినియోగించు కుంటున్నారు. పురుషులు మల, మూత్ర విసర్జనకు బయటకు వెళ్లాల్సి వస్తోంది.



కొఠారుబిల్లి రైతు బజారు

ప్రతిపాదనలు పంపించాం

రైతు బజారులో కొత్త షెడ్ల నిర్మాణానికి ఉన్నతాధికారులకు ప్రతిపాదనలు పంపించాం. అనుమతి వచ్చిన వెంటనే షెడ్ల నిర్మాణానికి చర్యలు తీసుకుంటాం. ఆర్‌ఓ ప్లాంట్‌ కోసం కూడా ప్రతిపాదనలు పంపించాం.

– కునుకు సంతోష్‌, రైతు బజారు ఇంచార్జి ఎస్టేట్‌ అధికారి

ఆర్థిక సహాయం

శృంగవరపుకోట: మండలంలోని శివలింగపురం రైల్వే పాయింట్స్‌ మెన్‌గా పనిచేస్తూ మృతి చెందిన సత్యరంజన్‌ మహంతి కుటుంబానికి రైల్వే ఉగ్యోగులు గురువారం ఆర్థిక సహాయం చేశారు. మలేరియా బారిన పడిన సత్యరంజన్‌ ఈనెల 7వ తేదీన చనిపోవడంతో ఎటువంటి ఆధారం లేని ఆ ఉద్యోగి కుటుంబానికి పీఎంఏ నారాయణరావు తమ ఉద్యోగులను సహాయం అందించి ఆదుకోవాలని కోరుతూ వాట్సాప్‌ గ్రూపుల్లో పోస్ట్‌ చేశారు. స్పందించిన రైల్వే ఉద్యోగులు, ఏపీఎం, ఏఐఎస్‌ఎంఏతో పాటు పలువురు స్టేషన్‌ సూపరింటెండెంట్లు, స్టేషన్‌ మాస్టరు, పాయింట్‌మెన్స్‌ రూ.1.22 లక్షలు పంపించారు. ఈమొత్తాన్ని సత్యరంజన్‌ కుటుంబానికి గురువారం అందజేశారు. సహకరించిన ప్లానింగ్‌ డీఏ రామరాజుకు ధన్యవాదాలు తెలిపారు.